క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

చీరాల అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు కోసం మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు, ఇంకొల్లు, వేటపాలెం, చిన్నగంజాం మండలాల్లోని ప్రయాణికులు 99592 25696 ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


యూ సాంబిరెడ్డి (ఫైల్)

అద్దంకి రూరల్: మండలంలోని రామాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కిరణ్ తండ్రి ఉప్పులూరి సాంబిరెడ్డి (63) అనారోగ్యంతో సోమవారం స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతికి వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలి


దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎంఈఓ

ఇంకొల్లు(చినగంజాం): దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకొని విద్యాపరంగా అభివృద్ధి చెందాలని ఇంకొల్లు ఎంఈవో కే శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవిత విద్యా వనరుల కేంద్రంలో పలువురు దివ్యాంగులకు ఆయన ఉపకరణాలు పంపిణీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఉపకరణాల క్యాంపులో ఇంకొల్లు మండలానికి వై దీక్ష (ట్రై సైకిల్), వీ వరుణ్ (రొలేటర్), ఎస్కే అఫ్రా (వినికిడి యంత్రం), వై అదన (వినికిడి యంత్రం)లకు ఉపకరణాలు మంజూరు కావడంతో వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనిత, ఐఆర్పీలు వీ వీరయ్య, ఎం హరిబాబు, ఆయా, తల్లిదండ్రులు, దివ్యాంగ చిన్నారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై హత్య కేసు నమోదు

మార్టూరు: సమీప బంధువుల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయమై సోమవారం రాత్రి మార్టూరు స్టేషన్లో కేసు నమోదైంది. అందిన వివరాల మేరకు.. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురు రోడ్డులో రామ్ జనార్దన్ కాలనీలో నివాసం ఉండే పిండ్రాల పోలయ్యకు అదే కాలనీలో నివాసం ఉండే అతని బాబాయి పిండ్రాల శ్రీను, పద్మ, చిన్నాలతో ఈనెల 10వ తేదీ రాత్రి ఘర్షణ జరిగింది. అందులో భాగంగా పోలయ్యను అతని బంధువులు రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. గాయాలతో బాధపడుతున్న పోలయను అతని భార్య గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. పోలయ్య పరిస్థితి విషమించి 12వ తేదీ రాత్రి ఆసుపత్రిలో మరణించాడు. మృతుడి వాంగ్మూలం మేరకు మార్టూరు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి మార్గం


మాట్లాడుతున్న న్యాయమూర్తి

అద్దంకి రూరల్: వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి మార్గమని సీనియర్ సివిల్ జడ్జి డీ.నాగవెంకటలక్ష్మీ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణ నుంచి స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం మీదుగా మెయిన్‌రోడ్డు నుంచి కోర్టువరకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన చేపట్టారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఇరువురు మధ్యవర్తిత్వంతో వివాదం పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. వేగవంతంగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఇది కోర్టు తీర్పుతో సమానమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రోటరీ కృషి

పర్చూరు(చినగంజాం): రోటర్ క్లబ్‌ల ద్వారా గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టాలని విజయలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ వేగిరాజు శివ వర్మ సూచించారు. పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సమగ్ర గ్రామీణాభివృద్ధి అవగాహన సదస్సు పర్చూరు బీవీఆర్ రోటరీ భవన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. అవగాహన సదస్సు నందు భీమవరం జిల్లా ప్రాత్తమెరక గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ట్రస్ట్ చైర్మన్ వేగిరాజు శివవర్మ తన గ్రామాభివృద్ధి చేసిన విధానం గురించి వీడియోలను ప్రదర్శించి వివరించారు. అనంతరం పర్చూరు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, ఆర్సీసీ చైర్మన్ పోటు రాఘవయ్యలు శివవర్మ దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేసిన పనులను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయ భాస్కర్, కొల్లా సుబ్బారావు, భవనం రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- రెండో రోజుకు చేరిన ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె
- వంటావార్పు, ర్యాలీతో నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

అద్దంకి: కూటమి పాలనలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకులు ధ్వజమెత్తారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం రెండో రోజుకు చేరింది. దానిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద టెంట్ వేసి నిరసన దీక్షలు చేపట్టారు. అక్కడే వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టి తమ నిరసనను తెలియజేస్తున్నారు. కార్మికులు, మున్సిపల్ ఆఫీసు నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయమైనదన్నారు. కార్మికులు ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్‌లు న్యాయబద్ధమైనవన్నారు. ప్రభుత్వం ఎన్నో పథకాలకు వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అదే విధంగా ఆర్భాట ప్రచారాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఈ మధ్యకాలంలో యోగా డే సందర్భంగా రూ.300 కోట్ల ప్రజాధనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెప్పు పొందడానికి వ్యయం చేసిందని దుయ్యబట్టారు. అధికారులను ఉరుకులు పరుగులు పట్టించి గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేయడం కోసం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల ఎందుకు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారో చెప్పాలన్నారు. కార్మికులంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్కలేదన్నారు. వారు ఆగ్రహిస్తే ప్రభుత్వాలు కూలుతాయని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికులతో చర్చలు జరిపి ఈ సమస్యని పరిష్కారం చేయడం కోసం ప్రయత్నం చేయాలన్నారు. లేని పక్షంలో మున్సిపల్ కార్మికులకు ప్రజా సంఘాలు మద్దతు కూడగట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పీ ఆదాం, ఇంజినీర్ విభాగం నాయకులు వీ జాన్. ఉసురుపాటి శామ్యూల్. మారుతి మార్కు రాజేశ్వరి, జాషువా, ఫ్రూట్ వెండర్స్ యూనియన్ నాయకులు తోట వెంకటేశ్వర్లు ఎస్ కే కరీమ్ సమ్మెలో పాల్గొన్న కార్మికులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

కారంచేడు: గ్రామాల్లోని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక కృషి చెయ్యాలని తహసీల్దారు జీ నాగరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, వ్యాపారులకు ప్రధానంగా ఉండే సమస్యలపై మనకు వచ్చే విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టినప్పుడే అధికారులపై ప్రజలకు నమ్మకం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని రిజిస్టర్ చేసి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే నేతాజీ, ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి..

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక మంచి అవకాశమని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహశీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా తహశీల్దార్ గోపీకృష్ణ మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై ప్రజలు 17 అర్జీలను అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పలుశాఖల ఉద్యోగులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే చర్యలు


అధికారులకు సూచనలు ఇస్తున్న ఉన్నతాధికారులు

జే.పంగులూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవని బాపట్ల సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీరు జీ ఆంజనేయులు హెచ్చరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆపరేషన్ విభాగం సంయుక్తంగా సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ ఇంజినీర్లు, ఆంజనేయులు, విజయకృష్ణ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఈఈ ఎం భాస్కరరావు, ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో 29 బృందాలుగా ఏర్పడి 1527 విద్యుత్ సర్వీసులు పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 59 మందికి రూ.1.53 లక్షలు, దొంగతనంగా విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ. 15 వేలు, ఇతరులు ముగ్గురికి రూ.18000 జరిమానా విధించారు. తనిఖీల్లో భాగంగా అద్దంకి డీఈఈ దామోదర్, మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, విజిలెన్స్ డీఈఈ విజశ్రీనివాసర్, అద్దంకి డివిజన్ అన్ని మండలాల ఏఈలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ పునరుద్ధరించాలని వినతి

మార్టూరు: అన్ని హంగులు కలిగిన మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని.. యార్డును పునరుద్ధరించి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని మండల రైతు సంఘం నాయకులు కోరారు. మార్టూరు ప్రాంత రైతులు ప్రస్తుతం పర్చూరు ఏఎంసీలో భాగంగా ఉన్నందున దూరభారం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నల్ల బర్లీ పొగాకు కొనుగోలులో సన్న, చిన్న కారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు. మార్టూరులో ఉన్న 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని, షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం ఉదయం ఏడు గంటల నుంచి ఆసుపత్రిలో టెక్నీషియన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బత్తుల హనుమంతరావు, వై రాంబాబు, సూరిబాబు, పాలె పు సాంబయ్య, శివరాం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

మార్టూరు: సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన మండల సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సోమవారం ఎంపీపీ భూక్యా శాంతి భాయ్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి రామినేని లావణ్య మాట్లాడుతూ హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కాని వారు, ఆధార్ కార్డులో తప్పులు సవరించుకున్న వారికి తమ పేర్లను నమోదు చేసుకోవడానికి సోమవారంతో గడువు ముగియనున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి బి హనుమంతు నాయక్ మాట్లాడుతూ ఆయిల్పాం సాగును ప్రోత్సహించడం కోసం రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు భారీగా అందజేస్తున్నట్లు తెలిపారు. హెక్టార్ ఆయిల్ పామ్ సాగుకు 150 మొక్కలు అవసరం అవుతుందని వీటి కొనుగోలుకు అయ్యే మొత్తం ఖర్చు రూ.29 వేలు ప్రభుత్వం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు సంవత్సరాల పాటు పంట నిర్వహణకు గాను హెక్టార్‌కు సంవత్సరానికి రూ.5200 చొప్పున నాలుగు సంవత్సరాలలో రూ.21 వేలు రైతుకు అందిస్తున్నట్లు తెలిపారు. అంతర పంటల సాగుకు సైతం నాలుగు సంవత్సరాలు పాటు సంవత్సరానికి రూ. 5200 చొప్పున రూ. 21 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బాపట్ల జిల్లా ఎంపికయ్యిందన్ని, ఖరీఫ్ సీజన్లో మిర్చి పంట సాగు చేయు రైతులు ఈ నెలాఖరులోపు ఎకరాకు రూ.1800 చొప్పున పంటల బీమా చెల్లించుకోవాలని ఆయన తెలిపారు. బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల వలన భూముల ఆన్లైన్ తప్పులు తడకగా నడుస్తుందని సవరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై శ్రీనివాసరావు, తహసీల్దార్ టి శిరీష, ఏవో రాంబాబు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కారంచేడు ఉద్యమంతో దళితుల ఆత్మగౌరవం పెంపు


మాట్లాడుతున్న కారంచేడు గ్రామ బాధిత పోరాట కమిటీ నాయకులు

చీరాల రూరల్: కారంచేడు ఉద్యమం దేశవ్యాప్తంగా ఉన్న దళితులలో స్ఫూర్తిని నింపడమే కాకుండా వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించిందని కారంచేడు బాధిత పోరాట కార్యనిర్వహణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం విజయనగర్ కాలనీలోని రుధిర క్షేత్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కారంచేడు బాధిత పోరాట కమిటీ నాయకులు మాట్లాడారు. కారంచేడు గ్రామంలో అగ్రవర్ణ భూస్వాములు మాదిగల మీద దాడిచేసి ఏడుగురి ప్రాణాలను బలిగొన్నారని, ఆ ఘటన జరిగి ఈనెల 17తో 40 ఏళ్లు పూర్తి చేసుకోనుందని చెప్పారు. ఉదమ్యం జరిగి 40 వసంతాలు పూర్తిచేసుకోనున్న సందర్భంగా ఈనెల 17న రుధిర క్షేత్రం వద్ద ఘనంగా సంస్మరణ సభ నిర్వహించేదుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారంచేడు గ్రామ బాధితులకు అండగా నిలిచిన అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, రచయితలు, దళిత బహుజన వాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని వారు కోరారు.కార్యక్రమంలో నాయకులు దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మార్టూరు: వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి పొగాకు కొనుగోలు కేంద్రం రైతులకు అందుబాటులోకి వచ్చింది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్డీవో గ్లోరియాతో కలిసి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మార్టూరు మండలంలో 701 మంది రైతులు పొగాకు సాగు చేయగా అందులో 621 మంది రిజిస్టర్ అయినట్లు తెలిపారు. ముందుగా తెలిపిన షెడ్యూల్ ప్రకారం దశల వారీగా పొగాకు కొనుగోలు చేస్తారని 20% తేమ కలిగిన పొగాకును రూ.12000, రూ.9000, రూ.6000 గా మూడు గ్రేడ్లుగా విభజించినట్లు వారు తెలిపారు. రాబోయే 40 రోజుల్లో పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు ఇతర అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట కృష్ణారెడ్డి

పర్చూరు(చినగంజాం): గ్రామీణ ప్రాంతాలలోని స్వచ్ఛంద సేవా సంస్థలు సమర్థవంతంగా తమ సేవలందించాలంటే దాతల సహకారం తప్పనిసరిగా అవసరమని రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు భవనం వెంకట కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నూతలపాడు గ్రామంలోని ఆశ్రయ వృద్ధాశ్రమంలో నిర్వహించిన నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భవనం వెంకట కృష్ణారెడ్డి, స్థానిక విజ్ఞాన్ ఇంగ్లిషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ జీ సుందరరాజు పాల్గొన్నారు. కువైట్ దేశంలో పనచేస్తున్న ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేసుకున్న బుషారి హెల్పింగ్ హ్యాండ్స్ నూతలపాడులోని ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధుల కోసం సుమారు రూ.17 వేల విలువ కలిగిన నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ కువైట్‌లో పనిచేస్తున్న ప్రవాసాంధ్రులు మన రాష్ట్రంలోని వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు తమ వంతు సాయమందించడం అభినందించదగిన విషయమన్నారు. ఆశ్రయ ఆశ్రమం నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి, సంస్థ కోఆర్డీనేటర్ సాయి యజ్ఞలు పాల్గొని దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భాగా నిర్వహించిన సమావేశానికి రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు సంస్థకు చెందిన సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు


డెంగీపై అవగాహన ర్యాలీ చేస్తున్న సబ్‌యూనిట్ ఆఫీసర్ రవిబాబు

కారంచేడు: గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా, లార్వా వ్యాప్తిని అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సబ్‌యూనిట్ ఆఫీసర్ రవిబాబు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం కారంచేడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో డెంగీ మాసోత్సాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లోని లోతట్టు ఆప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేలా వారిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాతావరణ మార్పులతో అక్కడక్కడ కురుస్తున్న వర్షాల కారణంగా మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు కూడా నిలచిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. లార్వాను అరికట్టేలా ప్రధానంగా వాడని నీటి తొట్లు తొలగించడం, తాగి పడేసిన కొబ్బరిబొండాలు నిల్వ లేకుండా చూడటం, టీకప్పులు, పూలకుండీలు వంటివి తొలగించుకోవడం చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన సిబ్బందితో కలసి లోతట్టు ప్రాంతాలలోని డ్రైనేజీలలో ఎబేట్‌ను పిచికారి చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు డీ శ్రీనివాసరావు, రవికుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ


చిన్నారులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న ఎంఈఓలు

వేటపాలెం: స్థానిక భవితా కేంద్రం వద్ద మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగ చిన్నారులకు ట్రై సైకిల్స్, వీల్ చైర్స్ మండల విద్యాశాఖ అధికారి జీవీ సుబ్బయ్య, పురుషోత్తమ్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రం ద్వారా దివ్యాంగ విద్యార్థులకు విద్యనందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు ఆర్ శ్రీధర్, ఎస్ ధనలక్ష్మి చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిరంకుశ వైఖరి తగదు


సమ్మె చేపట్టిన ఇంజినీరింగ్ కార్మికులు

చీరాల అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని స్వయంగా సీఎంకు రెండు సార్లు విన్నవించినా ఏ విధమైన స్పందన లేకపోవడంతో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న సమ్మె శిబిరం వద్ద ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత ఎనిమిది సంవత్సరాలగా ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుదలలో వివక్షత కొనసాగుతూ ఉందని, గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు నిర్ణయించే స్లాబులు నిర్ణయించడంలో లోపాలు జరగాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జీతాల పెంపు కోసం తొమ్మిది మందితో కమిటీ వేశారని, ఆ కమిటి నివేదిక ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు పంపారన్నారు. ఆ తర్వాత టీడీపీ హయాంలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి వెనక్కు పంపారన్నారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, చీరాల కమిటి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బాబూరావు, ఎం.వసంతరావు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

మార్టూరు: పంచాయతీ కార్యాలయం పక్కన గల ప్రభుత్వ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సోమవారం దాత ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన రైతు చిమటా వెంకటేశ్వర్లు బాలబాలికలకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి నిరక్షరాస్యుడైన వెంకటేశ్వర్లు విద్యార్థులకు నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయడాన్ని ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తికి బీమా చెల్లించాలి

బల్లికురవ: బాపట్లజిల్లా యూనిట్‌గా ప్రత్తి సాగుచేసే రైతులు తక్షణమే బీమాకు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి పీ. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరాకు రూ.1900 ప్రీమియం చెల్లిస్తే అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులతో పంట నష్టం సంభవిస్తే రూ. 38 వేలు బీమా వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఆర్థిక సాయం


మరియదాసు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మార్టూరు: మండలంలోని జొన్నతాళి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మతి స్థిమితం లేని ఓ యువకుడికి హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు సోమవారం ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన 38 సంవత్సరాల వయసుగల జంద్రాజుపల్లి మరియదాసు చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి మతిస్థిమితం లేక బంధువుల సాయంతో జీవనం సాగిస్తున్నాడు. వారి కుటుంబ స్థితిగతులు తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు రూ.12,500 నగదుతో పాటు నిత్యాసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో హాండ్స్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలి, పుట్టా అయ్యప్ప స్వామి, కేబుల్ బాషా, రషీద్, జాష్టి సాంబశివరావు, ఎస్. కే. ఖాజీ, విజయ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌కు రీసెర్చ్ సెంటర్ అనుమతి

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాకినాడ జేఎన్‌టీయు పరిశోధనా కేంద్రాలకు రీసెర్చ్ సెంటర్‌లకు అనుమతి ఇచ్చినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా కాలేజీలో సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాల్లో పరిశోధనలకు ఏర్పాటుకు అనుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే జగదీష్‌బాబు తెలిపారు. రీసెర్చ్‌కి అనుమతించడంపై కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందలు తెలిపారు.


అనుమతి పత్రాన్ని ప్రదర్శిస్తున్న కళాశాల యాజమాన్యం

వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కలిసి ఉండాలి


గ్రామ అధ్యక్షుడిని అభినందిస్తున్న మండల కన్వీనర్ శ్రీనివాసరావు

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కష్టపడి పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని చందలూరు గ్రామ కమిటి ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని గ్రామ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు సమక్షంలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు రావూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కమిటీలో ఆరుగురు సభ్యులు ఉంటారని, వారికి అనుబంధంగా మరో 15 మంది ఉంటారన్నారు. కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీ బలోపేతంగా ఉంటుందని తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా రాయిని స్టాలిన్ నియమితులయ్యారు. కార్యక్రమంలో నాయకులు జంపాని రాజా, పెంట్యాల రామాంజనేయులు, ముల్లూరి వెంకటేశ్వర్లు, మూరబోయిన ఆంజనేయులు, మందా పురుషోత్తం, మట్టకొయ్య మహేష్, రాకేష్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.